

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని ప్రతి పాఠశాలలో చదువుతున్న10వ తరగతి విద్యార్థులపై సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని డిఇఒ దేవరాజు ఆదేశించారు. శుక్రవారం నగరంలోని నగరపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి అధ్యక్షతలో పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి సంభాషణ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సమయం చాలా విలువైనది, ప్రణాళిక ప్రకారం చదవాలని చెప్పారు. వెనుకబడిన సబ్జెక్టులలో ప్రత్యేక శ్రద్ధ వహించి సబ్జెక్టులో ఉన్న సందేహాలను ఉపాధ్యాయుల చేత నివృత్తి చేసి కోవాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ పాలెం నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమం

ఏపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

- 26న కడపలో ట్రాక్టర్లతో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించిందని, రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాల్సిన అవసరమెంతైనా ఉందని ఏపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా రైతులు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శుక్రవారం పాత బస్టాండ్ రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా సమితి అధ్యక్షులు ఎం.వి. సుబ్బారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి హాజరయ్యారు. ముందుగా రిపబ్లిక్ డే రైతు ట్రాక్టర్ ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మద్దతు ధరలు రైతులకు అందేలా గ్యారెంటీ చట్టం వెంటనే తేవాలన్నారు. జిల్లాలో రైతుల ధాన్యం కొనుగోలులో వస్తున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు అన్వేష్, మనోహర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు రెడ్డి, చంద్రశేఖర్, సిద్దయ్య, కోటిరెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

విచారణ వాయిదా వేయడం సరైంది కాదు ముందస్తు రిజిస్ట్రేషన్ చేయించుకున్నప్పటికీ అర్ధాంతరంగా విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ బహిరంగ విచారణ వాయిదా వేయడం సరైంది కాదని ఏపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. విద్యుత్ నియంత్రణ మండలి ట్రూ ఆఫ్ చార్జీలపై మూడు రోజులపాటు బహిరంగ విచారణలో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం బహిరంగ విచారణకు కడప విద్యుత్ భవన్‌కు రావాలని ముందస్తు సమాచారం ఇచ్చారని తెలిపారు. అరగంట ముందే విద్యుత్ భవన్ కు వచ్చి విచారణ వాయిదా వేశామని సిబ్బంది చెప్పడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యుత్తు భారాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకపోతే మరో విద్యుత్ ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సభ్యులు దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి. శివ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృతమైన సేవలు అందివ్వాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సహకాల కారణంగా గత ఖరీఫ్‌లో సాధారణ సాగుబడి కంటే 135 శాతం అధికంగా సాగుబడిని పెంచగలిగామన్నారు. రబీ సీజన్‌లో సాగుబడికి అవసరమైన అన్ని రకాల నాణ్యమైన ఎరువులు, పెస్టిసైడ్స్‌ను రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి. శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచడంలో మార్కెట్ కమిటీలు మూల స్తంభాల్లా పని చేయాలన్నారు. రైతుల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలన కొనసాగుతోందన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ రూపొందించిన 2023 సంవత్సర డైరీలు, కేలండర్లను కలెక్టర్ సంబంధిత అధికా రులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెసి సాయి కాంత్ వర్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, ఉద్యానశాఖ డిడి మైఖేల్ రాజీవ్, 'ఆత్మ' పీడీ విజయకుమారి, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ శారద, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీమా ఉంటే ధీమా

కడప : ప్రతి ఒక్కరికీ బీమా ఉంటే ప్రమాద సమయాల్లో వారి ప్రాణ భద్రతకు, ఆరోగ్య, కుటుంబ భద్రకు ధీమా ఉంటుందని. ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ పేర్కొన్నారు. 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా శుక్రవారం కడప ఉప రవాణా కమిషనర్ కార్యాలయ ఆవరణలో డిటిసి అధ్యక్షతన 'రహదారి భద్రత - మోటారు వాహనాల ఇన్సూరెన్స్ ఆవశ్యకత' అనే అంశం గురించి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికైనా, వస్తువుకైనా బీమా ఉంటే ధీమా ఉంటుందని, అనుకోని సంఘటన జరిగితే మనకు లేదా మన కుటుంబానికి ఆర్థిక భరోసా ఇవ్వడమే బీమా ముఖ్య ఉద్దేశమని చెప్పారు. కార్యక్రమంలో ఎంవిఐ విజయ భాస్కర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ ప్రసన్న, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రకాష్, వాహన తనిఖీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దర్గా వద్ద మరుగుదొడ్ల నిర్మాణం ఆపాలి

కడప అర్బన్ : నగరంలోని ఒకటవ గాంధీ బొమ్మ సర్కిల్‌లో వందల సంవత్సరాల చరిత్ర గల శ్రీ హజరత్ మోహర్ షావలి దర్గా వద్ద మరుగుదొడ్ల నిర్మాణం ఆపాలని టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్‌బాబు, ధర్మపరిచయ కమిటీ చైర్మన్ బాబు భాయ్, టిడిపి నాయకులు జిలాని బాషా కోరారు. శుక్రవారం దర్గా ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ పెద్ద దర్గాకు పూల చాదర్ ప్రభుత్వ లాంఛనాలతో వెళుతూ ఉంటారని పేర్కొన్నారు. అంతటి చరిత్ర గల దర్గా సమీపంలో గోడ పక్కన కడప కార్పొరేషన్ వారు మరుగుదొడ్లు నిర్మించడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్, సంఘ సేవకులు సలావుద్దీన్, కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు నజీర్ అహ్మద్, మైనారిటీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్. దస్తగిరి, జాకీర్ మౌలానా, ప్రజలు పాల్గొన్నారు.

కమిషనర్‌కు కృతజ్ఞతలు

కడప అర్బన్ : నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో అడ్డదిడ్డంగా ఉన్న చెట్లను కమిషనర్ శుక్రవారం సిబ్బందిచే తొలగించడంతో టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య కృతజ్ఞతలు తెలిజేయశారు. చెట్లు విద్యుత్ తీగలకు, ఎన్‌టిఆర్ విగ్రహానికి ఆటకంగా ఉండడంతోపాటు ప్రజలు ఇబ్బందులు పడేవారని పేర్కొన్నారు. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగానే స్పందించిన కమిషనర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు నాదెళ్ల దస్తగిరి, బిసి సెల్ నగర అధ్యక్షుడు మల్లికార్జున, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు ఓబులేసు, నగర అధ్యక్షులు భాస్కర్ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు ఇమ్రాన్, 28,5,39,47 డివిజన్ ఇన్‌ఛార్జులు బండి జయ శేఖర్, గౌస్, జనార్దన్ రెడ్డి, రాఘవేంద్ర కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టిడిపి నాయకులు

రోడ్డు భద్రత అందరి బాధ్యత

కడప : రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగరంలో ర్యాలీ నిర్వహించారు. మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు నివారించేందుకు ఈ రహదారి భద్రత వారోత్సవాల అవగాహన ర్యాలీ చేపట్టామన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతి ఒక్కరూ మానవ దృక్పథంతో స్పందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి వీరా ప్రసాద్, మోటార్ వెహికల్ అధికారులు విజయ్ భాస్కర్, ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ ప్రసన్న, ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసుల రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు, విద్యార్థులు పాల్గొన్నారు

కబడ్డీ ఎంపికలకు విశేష స్పందన

కడప : జిల్లాస్థాయి 70వ సీనియర్స్ మహిళలు, పురుషులు కబడ్డీ జట్ల ఎంపికలు శుక్రవారం నగరంలోని శ్రీ తారకరామ లా కాలేజీలో నిర్వహించారు. ఎంపికలకు విశేష స్పందన లభించింది. కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల నుంచి దాదాపు 150 మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరయ్యారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. గోవర్ధన్ రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన మహిళలు, పురుషులు జట్లు ఈనెల 25 26 27 తేదీలలో మూడు రోజుల పాటు విశాఖపట్నంలోని అనకాపల్లి జిల్లా అంకుపాలెంలో నిర్వహించే 70వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కోచ్, కోశాధికారి జనార్ధన్, సురేష్ యాదవ్, సుకుమార్, సురేంద్ర, జుల్ఫికర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కంట్రోల్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు

కడప అర్బన్ : జిల్లాలో ఇటీవల కాలంలో వివిధ కేసుల్లో అత్యుత్తమ సేవలందించిన కమాండ్ అండ్ కంట్రోల్ సిబ్బందికి ఎస్.పి అన్బురాజన్ పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ప్రశంసా పత్రాలు అందచేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ఫూర్తిదాయకమైన సేవలందించి జిల్లా పోలీసు శాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేశారని కొనియాడారు. రాష్ట్రంలో జిల్లా ప్రత్యేక స్థానంలో నిలిచేలా కృషి చేశారని, మున్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్.పి(అడ్మిన్) తుషార్ డూడి, ప్రొద్దుటూరు ఎఎస్‌పి ప్రేర్ణాకుమార్, జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

కడప అర్బన్ : ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి, ఉర్దూ పాఠశాలల అభివృద్ధి కి అవిరళ కృషి చేస్తోందని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సూర్యారావు పేటలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) 2023 నూతన డైరీలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, రాష్ట్ర అధ్యక్షులు లయన్ ఇమామ్ బాషా, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ అబ్దుల్ మునాఫ్ ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ఉర్దూ పాఠశాల, ఉపాధ్యాయుల సమస్యలను మంత్రి బొత్స దృష్టికి తీసుకు వెళ్లగా,సమస్యల పరిష్కారం పై ఆయన సానుకూలంగా స్పందించారు.

పది నిమిషాలు గడిస్తే ఇంటికి చేరుకునేవారు. అంతలోనే లారీ రూపంలో మృత్యువు వారిని కబళించింది. సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకొని బంధువులందరూ కలిసి వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వెళ్లారు. దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఇంటికి చేరుకునే సమయంలో రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృత్యువాత పడ్డారు.

కబళించిన మృత్యువు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టెంపో వాహనం



దుర్మరణం చెందిన అనూష, ఓబులమ్మ, రామలక్షుమ్మ

- తిరుమలకు వెళ్లి వస్తూ ఘటన
- పది నిమిషాల్లో గమ్యస్థానం... అంతలోనే ప్రమాదం
- చాపాడు వద్ద బొగ్గు లారీని వెనుక నుంచి ఢీకొన్న టెంపో వాహనం
- ముగ్గురు మహిళలు దుర్మరణం
- 8 మందికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - చాపాడు/ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మైదుకూరు – ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై మండల కేంద్రమైన చాపాడులోని దిలీప్ ఇండేన్ గ్యాస్ ఎదురుగా శుక్రవారం తెల్లవారుజామున ఆగి నిధానంగా ముందుకు కదులుతున్న బొగ్గు లారీని వెనుక వైపు వస్తున్న టెంపో వ్యాన్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన కుడుముల రామలక్ష్మమ్మ (52), ఓబులమ్మ (47), సాలెం అనూష (28) అక్కడికక్కడే మృతి చెందారు. కుడుముల గంగిరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీరామ్ రెడ్డి, జయలక్ష్మి, రామాంజనేయమ్మ, విజయ్ కుమార్ రెడ్డి, గంగా అనిత, ఆంజనేయ రెడ్డిలకు బలమైన గాయాలయ్యాయి. వీరిని 108 సహాయంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో రామకృష్ణారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. గంగిరెడ్డిని ప్రొద్దుటూరులోని కెవిఆర్ వైద్యశాలలో మెరుగైన వైద్య చికిత్స కోసం తరలించారు.

పులివెందుల సమీపంలోని ఇనగనూరుకు చెందిన కుడుముల గంగిరెడ్డి, రామలక్ష్మమ్మ దంపతులు ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలో కొనేళ్లుగా నివాసముంటున్నారు. వేరుశెనగ కాయల వ్యాపారం చేస్తూ మీరు జీవనం సాగిస్తున్నారు. ఆయన సోదరుడు గంగాధర్ రెడ్డి, ఓబులమ్మ అదే గ్రామంలోనే వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. గంగిరెడ్డి, గంగాధర్ రెడ్డిలు సోదరులు కాగా రామలక్ష్మి, ఓబులమ్మలు అక్కా చెల్లెలు. గంగిరెడ్డి రామలక్ష్మి కుమార్తె సాలెం అనూషను వీరపునాయుని పల్లె మండలం తాటిమాకుల పల్లె



మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి

గ్రామానికి చెందిన విజయ్ కుమార్ రెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. వీరందరూ సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకొని బుధవారం సాయంత్రం తమ బంధువైన ఆంజనేయరెడ్డికి చెందిన టెంపో వాహనంలో తిరుమలకు వెళ్లారు. గురువారం దర్శనం పూర్తి చేసుకొని శ్రీకాళహస్తికి వెళ్లి అక్కడి నుంచి ప్రొద్దుటూరుకు తిరుగు ప్రయాణం అయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటలకు చాపాడు సమీపంలోకి రాగానే డ్రైవర్ కునుకు పాటుతో నిదానంగా మైదుకూరు నుంచి ప్రొద్దు టూరుకు వెళుతున్న బొగ్గు లారీని టెంపో వాహనం వేగంగా ఢీకొంది. ఈ టెంపోలో గంగిరెడ్డి, అతని సోదరుడు, అల్లుడు, కుటుంబ సభ్యులు, డ్రైవర్‌తో కలిసి 13 మంది ప్రయాణిస్తున్నారు. వీరిలో ముగ్గురు మహిళలు దుర్మరణం చెందారు. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామకృష్ణారెడ్డి అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. జి ధరణి అనే రెండు సంవత్సరాల పాపకు ఎలాంటి గాయాలు కాలేదు. చాపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు పలువురు పరామర్శ..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎంఆర్ కాలనీకి చెందిన గంగిరెడ్డి కుటుంబ సభ్యులను శుక్రవారం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి ,టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరా మర్శించారు. మృతదేహాలను పరిశీలించి ప్రగాఢ సానుభూతి తెలి పారు. రోడ్డు ప్రమాదంపై ఆరా తీశారు. అనూష, ఓబులమ్మ, రామలక్ష్మి మృతదేహాలకు వెంటనే పోస్టుమార్టం చేయించి గాయాలు పాలైన వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందేలా ఉన్నతా ధికారులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఆర్‌టిఒ

చాపాడులో ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగి ముగ్గురు దుర్మరణం చెందడంతో అధికారులు హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రొద్దుటూరు ఆర్టీవో సుశీల సంఘటన స్థలాన్ని పరిశీలించి వాహనాలకు చెందిన పత్రాలను సేకరించారు. వాహనాల పర్మిట్, లైసెన్స్ తదితర వాటిని పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తామన్నారు. బొగ్గు లారీ రోడ్డుపైన ఆగి ఉందా, నిదానంగా వెళ్తోందా అన్నదానిపై పరిశీలన చేస్తున్నామన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకోవడం బాధాకరంగా ఉందని ఆర్టీవో తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

జాబ్ కేలండర్ ఎప్పుడు జగనన్నా?

కడప అర్బన్ :ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిరుద్యోగులకు ఉద్యోగాలు అయిన ఇవ్వాలి, లేదా భృతి అయిన ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల.శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వస్తే ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ వదులుతానని చెప్పి ఒక్క జాబ్ కేలండర్ కూడా వదలేదని వాపోయారు. రాష్ట్రంలో చదువుకున్న యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో ఉద్యోగ భర్తీ చేసే వరకు నిరుద్యోగులకు భృతి సౌకర్యం అయిన కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి షాకీర్,సుబ్బారాయుడు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

పోరుమామిళ్ల : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బద్వేలు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రావు ఆధ్వర్యంలో రహదారి భద్రత, వాహనాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరమూ జనవరి 18 నుంచి 24 వరకు వారం రోజుల పాటు రాష్ట్రమంతటా రహదారి భద్రతా వారోత్సవాల పేరిట ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. యువత కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, కార్యక్రమంలో పోరుమామిళ్ల సర్కిల్ ఇన్స్ పెక్టర్ సురేష్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ జయసుబ్బారెడ్డి, అధ్యాపకులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

కడప అర్బన్ : కొప్పర్తి మెగా పారిశ్రామిక వాడలో స్థానిక నిరుద్యోగులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ వేలాది మంది నిరుద్యోగ యువత డిగ్రీ పట్టాలు పొంది ఉపాధి అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని పేర్కొన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడ కేంద్రంలో స్థానిక నిరుద్యోగులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.


ట్రూ ఆఫ్ ఛార్జీలను సమానంగా ఉంచాలి

ప్రజాశక్తి - కడప

ట్రూ ఆఫ్ ఛార్జీలను ఒక్కో డిస్కంలో ఒక్కో విధంగా పెట్టడం అభ్యంతరకరమని, అన్ని డిస్కంలలో సమానంగా ఉంచాలని రాజంపేటకు చెందిన టి. విజయగోపాల్ రెడ్డి రెండవ రోజు శుక్రవారం నిర్వహించిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో ఎపిఇఆర్‌సి చైర్మన్ చైర్మన్ సివి నాగార్జున రెడ్డికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు.

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన జడ్జి

కడప : సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత శుక్రవారం పురుషుల, మహిళ కేంద్రకారాగారాన్ని సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న వసతులు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. సమస్యలు ఏమైనా ఉంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పారా లీగల్ వాలంటరీలు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విధానాలు తెలియజేశారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో జైలు అధికారులు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హరిబాబు, ఖైదీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయభారత్ రెడ్డి

ఎల్ఐసి వ్యాపార అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -కడప అర్బన్

ఎల్ఐసి వ్యాపార అభివృద్ధికి ఏజెంట్లు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) డివిజన్ అధ్యక్షులు జయభారత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం విశ్వేశ్వరయ్య భవన్‌లో లియాఫీ జెఎసి కడప డివిజన్ 2వ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెంట్లకు మెడ క్లయిములు చెల్లించాలని కోరారు. డెత్ క్లయిములు త్వరగా పరిష్కరించాలని పేర్కొన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ మొత్తాన్ని పెంచాలని చెప్పారు. డెవలప్మెంట్ ఆఫీసర్స్ పోస్టులలో ఏజెంట్లకు 25 శాతం రిజర్వేషన్స్ ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌డిఎం గిరిధర్ మాట్లాడుతూ ఎల్ఐసి అభివృద్ధిలో ఏజెంట్ల పాత్ర కీలకమన్నారు. మంచి వ్యాపారాన్ని చేసి కడప డివిజన్‌ను ప్రథమ స్థానంలో నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలిండియా ప్లానింగ్ కమి టీ చైర్మన్ నారాయణరెడ్డి, జోనల్ చైర్మన్ కృష్ణారెడ్డి, డివిజన్ కార్యదర్శి కదిరప్ప, కోశాధికారి కృష్ణ, డివిజన్ ప్లానింగ్ కమిటీ చైర్మన్ నాగ శివారెడ్డి, ఉమెన్ వెల్ఫేర్ చైర్మన్ ఆర్ మాధవి, కార్యనిర్వాహక కార్యదర్శి ఇస్మాయిల్, కడప బ్రాంచ్ అధ్యక్షులు నిత్యానంద రెడ్డి, ఉపాధ్యక్షులు రాజేంద్ర, రెసిడెన్షియల్ కార్యదర్శి బి. రామచంద్రారెడ్డి, జోనల్ ఈసీ మెంబర్ చంద్ర మోహన్ రెడ్డి, డివిజన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు చెన్నయ్య, సెక్రటరీ ఈశ్వర్ రెడ్డి, కోశాధికారి కె.వి.రమణారెడ్డి, ఏజెంట్లు పాల్గొన్నారు.

వైవీయూకు చేరిన న్యాక్ 'ఎ' గ్రేడ్ ధ్రువపత్రాలు

కడప అర్బన్: ఇటీవల సాధించిన న్యాక్ 'ఎ' గ్రేడుతో యోగి వేమన విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్టలు మరింత పెరిగాయని విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి విసి ఆచార్య జింక రంగ జనార్ధన్ అన్నారు. శుక్రవారం న్యాక్ వారు పంపిన ఇన్‌స్టిట్యూషనల్ గ్రేడ్, అలాగే ఎక్రిడిటేషన్ ధృవ పత్రాలను ఈ సందర్భంగా విసి, రిజిస్ట్రార్ వై.పి. వెంకటసుబ్బయ్య ఐక్యు ఎసి సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్య శర్మకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ స్థలంలో సచివాలయం నిర్మించాలి : సిపిఎం

కడప అర్బన్ : నగరంలోని సాయిపేట దళితవాడలో ఉన్న ప్రభుత్వ స్థలంలో తక్షణమే సచివాలయం లేదా కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ డిమాండ్ చేశారు .శుక్రవారం సాయిపేటలో సిపిఎం నగర నాయకులు పర్యటన నిర్వహించారు.ఈ సందర్భంగా తమ దృష్టికి వచ్చిన సమస్యల్ని నగర పాలక యంత్రాంగం తక్షణమే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సాయిపేట పట్టణ ఆరోగ్య కేంద్రం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలం కొనేళ్లుగా ఖాళీగా ఉందని, అన్యాక్రాంతం కాక ముందే ఆ స్థలంలో సచివాలయం లేదా కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. .సచివాలయం ఏర్పాటు కోసం సిబ్బంది గతంలో అనేకసార్లు పరిశీలన చేశారని, కార్యాచరణ ఇంకా ప్రారంభించలేదని అన్నారు. ఆ స్థలం ప్రభుత్వ అవసరాలకు మాత్రమే వినియోగించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు చంద్రరెడ్డి, నగర కమిటీ సభ్యులు పారుక్ హుస్సేన్, ఓబులేసు స్థానికులు ఆల్ఫ్రెడ్, ఎసన్న పాల్గొన్నారు.

మైనార్టీ కాలనీలో డ్రెయినేజీ నిర్మాణ పనులు

చెన్నూరు : గ్రామ సచివాలయం-1 పరిధిలోని మైనార్టీ కాలనీలో డ్రెయినేజీ సమస్యను స్థానికులు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పనులు చేపట్టాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను ఎంఎల్‌ఎ ఆదేశించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కమలాపురం నియోజకవర్గ మైనార్టీ కన్వీనర్ అన్వర్‌బాష, అబ్దుల్‌రబ్, మండల ఉపాధ్యక్షులు వారిష్, ఎంపిటిసి సాదక్‌అలీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. అలాగే రూ.5 లక్షలతో డ్రెయినేజీ పనులను ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జుమన్, మార్కెట్ యార్డ్, డైరెక్టర్ కరీం, మాజీ ఎంపీటీసీ మునీర్ అహ్మద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే


కడప : జాతీయ కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వ మేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే మళ్లీ ఇందిరమ్మ రాజ్యం, ఇంటింటా సౌభాగ్యం వస్తుందన్నారు. బిజెపి నరేంద్ర మోడీ ప్రధాని అయినప్పటి నుంచి దేశం అన్ని రకాల దివాళా తీసిందన్నారు. దేశవ్యాప్తంగా పరిశ్రమలను ప్రయివేట్ పరం చేయడం దారుణమన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ వస్తే దేశం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న చీకటి చార్లెస్

సైన్స్ పట్ల అవగాహన అవసరం

కడప : విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహన పెంపొందిస్తూ నూతన పరిశోధన అంశాలను తెలియజేయడానికి ఇటువంటి వర్క్ షాపులు విద్యార్థులకి ఎంతగానో సహాయపడతాయని జోన్ ఫోర్ కళాశాల విద్య ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ పి.బాబు అన్నారు. ఆర్ట్స్ కళాశాలలో వర్క్‌షాపు నిర్వహించడం ఆనందంగా ఉందని చెప్పారు. ప్రభుత్వ పురుషుల కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల సైన్స్ అకాడమీ లెక్చర్ వర్క్షాప్ ఆన్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జెనెటిక్స్ శుక్రవారం ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ కన్వీనర్, మైసూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్.బి. రామచంద్ర, సెంటర్ ఫర్ డిఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నొస్టిక్ చెందిన డాక్టర్ ఎం సుబ్బారెడ్డి, బయోటెక్నాలజీ విభాగాధిపతి కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ పి కల్పనా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పి. బాబు

పెన్షన్ కోసం తప్పని తిప్పలు

ఉప ఖజానా కార్యాలయం వద్ద పెన్షనర్ల పడిగాపులు



కార్యాలయం వద్ద వేచి ఉన్న వృద్ధులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లు ఉపఖజానా కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తున్న పెన్షన్‌దారులు పెన్షన్ కోసం, ఉద్యోగుల జీతాల బిల్లులు, కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఉప ఖజానా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అవస్థలు పడుతున్నారు. అంతేకాక పలు పనులతో కార్యాలయానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉప ఖజానా కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోవడం వల్ల తిప్పలు తప్పడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ముద్దనూరు, కొండాపురం మండలాలకు సంబంధించి కార్యాలయం ఇక్కడే ఉంది. ఈ కార్యాలయంలో ఒక ఎస్‌టిఒ, ఒక జూనియర్ అసిస్టెర్ విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు 11,12 గంటలైనా విధులకు హాజరుకావడం కాలేదనే ఆరోపణలున్నాయి. నిత్యం ఇలాగే జరుగుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని ప్రభుత్వం ఫేస్ యాప్, బయోమెట్రిక్ హాజరు పెడుతున్నా వారిలో మార్పురాలేదనే విమర్శలున్నాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు, ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్లు మంజూరు చేయాలంటే జూనియర్ అసిస్టెంట్‌కు పర్సెంటేజ్ చెల్లించాల్సిందేనని బాధితులు ఆరోపిస్తున్నారు. ఎస్‌టిఒ ఉన్నా అంతా తానై వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జూనియర్ అసిస్టెంట్ ఎనిమిదేళ్లుగా ఇక్కడే తిష్ట వేసుకుని ఉన్నారు. జూనియర్ అసిస్టెంట్ ఎన్‌జిఒ అధ్యక్షులుగా ఉంటున్నారు. ముద్దనూరు మండలం కోడిగాండ్లపల్లె, పెనికెలపాడు గ్రామాలకు చెందిన ఇద్దరు వృద్ధులు పెన్షన్ కోసం శుక్రవారం వచ్చి పడిగాపులు కాశారు. మిగతా మండలాల్లో పెన్షన్లు మంజూరైనా ఇక్కడ మాత్రం ఇంకా పడలేదంటూ తిప్పుకుంటున్నారని పెన్షనర్ గోవిందయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. మధ్యాహ్నం 12గంటల వరకు ఇక్కడే పడిగాపులు కాసినా రాలేదన్నాడు. కొండాపురం మండలానికి చెందిన లక్ష్మీదేవి తన సిఐఎస్‌ఎఫ్ ఐడి కోసం ఇకెవైసి అప్డేట్ చేసుకునేందుకు వచ్చామని, ఫలితం శూన్యమని ఆవేదన చెందారు. ప్రమీల అనే విశ్రాంత ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ తాను లైవ్ సర్టిఫికేట్ ఇచ్చేందుకు కొండాపురం నుండి వచ్చానని, అధికారులు మధ్యాహ్నం 12 అయినా రాకపోవడం శోచనీయమన్నారు. ఉదయం 10గంటల నుండి 11 మధ్య కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తాయని వారు ఆరోపిస్తున్నారు. పెన్షన్లు, జీతాలు, బిల్లులు సకాలంలో చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కూల్చివేతను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అన్నదాన సత్రాన్ని రెవెన్యూ అధికారులు కూల్చివేయడాన్ని గండికోట గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గండికోట గ్రామానికి దగ్గరలో ఎనిమిది నెలల క్రితం దాదాపు 40 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిం చారు. అక్కడ ప్రతి శనివారం భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు. ఈ నేప థ్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు నెలల నుండి అన్నదాన సత్ర నిర్మాణం జరుగుతోంది. నిర్మాణం చివరి దశలో ఉండగా, ఎలాంటి నోటీసు లేకుండా రెవెన్యూ శాఖ, పోలీసులు అన్నదాన సత్రాన్ని కూల్చేందుకు జెసి బిలతో ఆలయం వద్దకు రాత్రి 10గంటలకు చేరుకున్నారు. విషయం తెలుసు కున్న గ్రామస్తులు హుటాహుటిన ఆంజనేయ స్వామి విగ్రహం వద్దకు వెళ్లి అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామంలో ప్రజలంతా ఏకమై ఆంజనేయస్వామి విగ్రహం వద్ద బైఠాయించారు. దీనిపై తహ శీల్దార్, పోలీస్ అధికారులు, సర్పంచు కె.గురుఈశ్వర్, గుడి నిర్వాహకులతో చర్చించారు. అన్నదాన సత్రం కూల్చివేతను తాత్కాలికంగా వాయిదా వేశారు.



కూల్చివేతను అడ్డుకుంటూ బైఠాయించిన స్థానికులు

త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇంటి నిర్మాణాలపై మండలస్థాయి అధికారులతో జడ్‌పిటిసి చర్చించారు. స్థానిక రాజీవ్‌కాలనీ, ఎస్సీ కాలనీ సమీపంలోని జగనన్న కాలనీలను ఆయన అధికారులతో కలిసి ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడంతోపాటు లబ్ధిదారులు అడిగిన వెంటనే ఇంటి సామగ్రిని అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్‌పిటిసి కోరారు. కులం, మతం అనే తేడా లేకుండా రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మిగాయత్రి, మండల స్పెషల్ అధికారి డాక్టర్ రవీంద్రారెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, హౌసింగ్ ఎఇ సుకుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్, గ్రామ సచివాలయ ఇంజనీర్లు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

కూలీలను పెంచి పనులు వేగవంతం చేయాలి

పులివెందుల టౌన్ : జగనన్న హౌసింగ్ కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు కూలీల సంఖ్యను పెంచాలని వైసిపి పురపాలక ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, పురపాలక చైర్మన్ వల్లెపు వరప్రసాదు కాంట్రాక్టర్లకు సూచించారు. ఆ పనులను శుక్రవారం వారు అధికారులతో కలిసి పరిశీలించారు. కాలనీలో మౌలిక సదుపాయాలు సంబంధించి జరుగుతున్న నీటి సరఫరా, భూగర్భ డ్రయినేజీ పనులను, సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పురపాలక కమిషనర్ నరసింహారెడ్డి, హౌసింగ్ డిఇ బాలగంగన్న, అధికారులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం చెప్పాలి



ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్


ప్రజాశక్తి - ఖాజీపేట

రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పి, టిడిపికి పట్టం కట్టాలని మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. మండల పరిధిలోని త్రిపురవరం గ్రామంలో శుక్రవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి ఏమాత్రం జరగలేదని విమర్శించారు. గత పాలనకు ప్రస్తుత వైసిపి పాలనకు వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు సందుల నాగశివారెడ్డి, హరినాథ్‌రెడ్డి, నారాయణ యాదవ్, కమలాపురం ఫరూక్ అహ్మద్, రామానాయుడు, కమలాపురం గౌస్ మొహిద్దిన్, పల్లె గంగాధర్, గోవిందు సుబ్బయ్య, పత్తూరు ఉపసర్పంచు ముత్తూరు రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైలవరం : నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వం ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చలేదని టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పొన్నంపల్లి గ్రామంలో శుక్రవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యువకులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికి తిరిగి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ.. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాలని భూపేష్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : టిడిపి నిర్వహిస్తున్న ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని ఆ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 7వ వార్డు గోకుల్ నగర్ ప్రాంతంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, 7 వార్డు బండారు శ్రీనాథ్, రజక సంఘం వెంకటరమణ, శంకర్‌రెడ్డి, శివారెడ్డి, టింబర్ డిపో షఫీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని నెర్రవాడ ఎస్‌టి కాలనీ



సరైన రోడ్డు, పక్కా గృహాలకు నోచని ఎస్‌టి కాలనీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నెర్రవాడ గ్రామ సమీపాన ఉన్న ఎస్‌టి కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. యానాది, ఎరుకల సంతతికి చెందిన 20 కుటుంబాల వారు ఇక్కడ 20 ఏళ్లకు పైగా నివాసం ఉంటున్నారు. గత కాంగ్రెస్ ప్రభు త్వ హయాం నుండి రోడ్లు, ఇళ్లు మంజూరు చేయకపోవడంతో పూరి గుడిసెలోనే నివాసం ఉంటున్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు ఈ కాలనీలో వెచ్చించి అభివృద్ధి చేయాలని పలు మార్లు అధికారులు నివేదికలు సిద్ధం చేసినప్పటికీ.. అవి ఆచరణలో అమలు కావడంలో విఫలమయ్యాయి. గత టిడిపి ప్రభుత్వ హయాం లో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను ఆ కాలనీ లోనే అభివృద్ధి చేయాలని ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. అయితే నెర్రవాడ ఎస్‌టి కాలనీ ఆ నిధులకు నోచుకోలేదు. దీంతో నేటికీ అభివృద్ధికి దూరంగానే ఉంది. వృత్తి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదరణ లేదు. గతంలో విద్యుత్ సరఫరా కూడా లేక నానా అవస్థలు పడే వారు. కాలనీ కంప చెట్ల మధ్య ఉంది. ఈ మధ్యకాలంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కరెంటు వసతి మాత్రం కల్పించారు. ఈ కాలనీ సమీపంలో జగనన్న కాలనీ నిర్మాణం జరుగుతోంది. పేదలకు స్థలం మంజూరు చేసి ఇళ్లు నిర్మిస్తున్నారు. నూతన కాలనీతోపాటు తమ కాలనీని కూడా అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.

వైసిపి పాలనలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి పాలనలో రాష్ట్రంలో విద్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాతృభాష మృతభాషగా మారిందన్నారు. తెలుగుకు తెగులు పట్టుకోవడంతోపాటు ఆంగ్లం అధ్వానంగా ఉందన్నారు. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేసి, ఆ స్థానంలో ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెడుతూ సిఎం జగన్ 2019లో జిఒ 85ను జారీ చేశారన్నారు. దీని వల్ల విద్యార్థి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైనట్లు వివరించారు. ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన వార్షిక నివేదికల ద్వారా ఇది స్పష్టం అవుతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం వేంపల్లెలో నాలుగు రోజులుగా వాహనాదారులకు కంటి మీద కునుకు లేకుండా భయపడుతున్నారని తెలిపారు. వాహనాలకు నిప్పు పెడుతున్న నిందితులను పట్టుకొని కఠినంగా చట్ట ప్రకారం శిక్షించాలని ఆయన కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు రాత్రి సమయంలో గస్తీ ముమ్మరం చేయాలని తులసిరెడ్డి పోలీసులను కోరారు.

వాల్మీకులను ఎస్‌టిలుగా గుర్తించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్రంలోని వాల్మీకి బోయలను ఎస్‌టిలుగా గుర్తింపుని వ్వాలని వాల్మీకి సంఘం నాయకులు ఏకసభ్య కమిషన్ చైర్మన్ శామ్యూల్ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. శుక్రవారం విజయవాడలో రాష్ట్ర వాల్మీకి నాయకులు జక్కల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్‌ను కలిసి బోయల స్థితిగతులను, సామాజిక, ఆర్థిక పరిస్థితుల గురించి వివరించి, వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు కృష్ణమూర్తి, వెంకటేష్, చంద్రమౌళి, గాంధీ, మల్లికార్జున పాల్గొన్నారు.



చైర్మన్‌కు వాల్మీకి చిత్రపటాన్ని అందజేస్తున్న సంఘ నాయకులు

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభు త్వం అనుమతి పొందిన నాణ్య మైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను మాత్రమే రైతులకు విక్ర యించాలని ఎఒ వెంకట కృష్ణారెడ్డి దుకాణ యజమానులను ఆదేశిం చారు. మండల కేంద్రం లోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఎఒ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ప్రతి నెల దుకాణాలు తనిఖీ చేసి ఎంపిక చేసిన ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల నమూనాలను సేకరించి పరీక్ష నిమిత్తం సంబంధించిన ప్రయోగశాలకు పంపనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే మ్యూరేట్ ఆఫ్ పోటాష్, చిలేటేడ్ జింకు 12శాతంను నమూనా సేకరించినట్లు తెలిపారు. నిర్దేశించిన ధరలకే విక్రయించాలన్నారు. స్టాక్ రిజిస్టర్లు ప్రతిరోజు అప్డేట్ చేసి ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలు ఉండేలా చూసుకోవాలన్నారు.



పరీక్ష నిమిత్తం విత్తనాలను సేకరిస్తున్న ఎఒ

పారిశుధ్యంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఖాజీపేట

పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు ప్రజలకు సూచించారు. ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించి, ప్రజలను అప్రమత్తం చేశారు. స్థానిక అగ్రహారం గ్రామంలో చేపట్టిన కార్యక్రమాన్ని పర్యవేక్షించి, ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో పలు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు చేరకుండా చూసుకోవాలని సూచించారు. దోమ తెరలు తప్పక వాడాలన్నారు. కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలన్నారు. కార్యక్రమంలో డిపియంఒ శశిభూషణ్‌రెడ్డి ఖాజా, జిల్లా ఆరోగ్య విస్తరణ అధికారులు, కెఎస్‌వి ప్రసాద్, యంవివి ప్రసాద, వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.ముబీన్, మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, సూపర్‌వైజర్స్ కృష్ణప్రియ, సునీల్‌కుమార్. ఎఎన్ఎం సునీత, యంఎల్‌హెచ్‌పి ప్రసన్న, ఆశా కార్యకర్త రాజేశ్వరి పాల్గొన్నారు.



డ్రమ్మును పరిశీలిస్తున్న నాగరాజు

చాపాడు ఎస్ఐగా కెసి రాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు ఎస్ఐగా కెసి రాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అట్లూరు ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. చాపాడు ఎస్ఐగా పనిచేస్తున్న డాక్టర్ నాయక్ అంతర్ జిల్లా బదిలీపై కర్నూలు జిల్లా బనగానపల్లె నియోజకవర్గం ఆలూరు ఎస్ఐగా వెళ్లారు. అనంతరం ఎస్ఐ రాజు మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చని ఆయన సూచించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెండ్లిమర్రి

మండలంలోని కడప-పులివెందుల ప్రధాన రహదారి చీమలపెంట గ్రామ సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. పులివెందుల నుండి కడప వైపునకు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఆ వ్యక్తిని ఢీకొనడం వల్ల తలకు తీవ్ర గాయమై చనిపోయినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. విచారణలో అతను భిక్షాటన చేసుకునే వ్యక్తి అయి ఉండవచ్చని ఆ ప్రాంతవాసులు తెలిపారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నా మన్నారు. మృతుడిని గుర్తు పడితే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

వాహనాలకు నిప్పపెట్టింది మతిస్థిమితంలేని వ్యక్తి : డిఎస్‌పి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో ఇటీవల వరుసగా జరిగిన మోటర్ బైకులకు నిప్పు పెట్టిన సంఘటనలో మానసిక పరిస్థితి సరిగాలేని వ్యక్తిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు పులివెందుల డిఎస్‌పి శ్రీనువాసులు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లెలో 4 బైకులు, ఒక కారు దగ్ధమైన సంఘటనలో ఓ మతిస్థిమితంలేని వ్యక్తి చేసినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు విశాఖపట్నంలోని మానసిక రోగుల ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయించనున్నట్లు తెలిపారు. మోటర్ బైకులకు నిప్పు పెట్టిన కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నట్లు డిఎస్‌పి తెలిపారు. ప్రజలు కూడా వాహనాలను సురక్షితమైన ప్రాంతాల్లో పెట్టుకోవాలని ఆయన సూచించారు. అవాంఛనీయ సంఘటనలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అదనపు సిబ్బందితో రాత్రి సమయంలో పోలీసు గస్తీ ముమ్మరం చేసినట్లు వివరించారు. విలేకరుల సమావేశంలో సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రఘురాం, తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనువాసులు

రోడ్డు భద్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ఎంవిఐ నారాయణ నాయక్ తెలిపారు. 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆర్‌టిఒ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. రోడ్డు నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా తమ ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులతో గడిపేలా అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో స్పందించాలన్నారు. ప్రయాణికులు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిఎం, ట్రాఫిక్ పోలీసులు, త్రీ టౌన్ ఎస్ఐ కృష్ణంరాజు నాయక్, ఎంవిఐ వేణు, అసిస్టెంట్ ఎంవిఐ శ్రీనివాస్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌టిఒ అధికారులు

వాహన చోదకులు జాగ్రత్తలు తీసుకోవాలి

పులివెందుల రూరల్ : వాహన చోదకులు జాగ్రత్తలు పాటిస్తూ వెళ్లాలని ఎంవిఐ బి.వెంకట ప్రసాద్ సూచించారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మూడవరోజు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా యువకులు వాహనాన్ని నడిపేటప్పుడు సూచనలు తప్పక పాటించాలన్నారు. అతివేగంగా వెళ్లకూడదన్నారు. వాహనచోదకుల్లో వయసు పైబడిన వారు కంటి చూపును కచ్చితంగా పరీక్షించుకోవాలని తెలిపారు. ముందుగా ఎంవిఐ కార్యాలయంలో డ్రైవర్లకు కంటి వైద్య నిపుణులు హిమబిందు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ హాజీవల్లి, పవన్‌కుమార్, ఇలియాస్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అరటిలో తేమ శాతం తక్కువ ఉండేలా చూసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

అరటిలో తేమ శాతం తక్కువ ఉండేలా రైతులు చూసుకోవాలని ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ దత్తరెడ్డి, ఎఒ రెడ్డెయ్య సూచించారు. మండలంలోని తాళ్లపల్లె గ్రామంలో శుక్రవారం వారు అరటితోటలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో వారు మాట్లాడుతూ వాతావరణంలో తేమతో కూడిన గాలి ద్వారా అరటి పంటలో సిగటొక వైరస్ వ్యాప్తి చెందుతుందన్నారు. నీటిని డ్రిప్ ద్వారా అరటి పంటకు అందిస్తే వైరస్‌ను కట్టడి చేయవచ్చన్నారు. అరటి ఆకులపై శిలీంధ్ర నాసినిలను పిచికారి చేసిన తర్వాత మాత్రమే ఆకులను కోసి తీసేయాలని సూచించారు. మినరల్ ఆయిల్‌ను ఖచ్చితంగా స్ప్రే చేసుకోవాలని తెలిపారు. ప్రతి రైతు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ రేష్మా, విహెచ్ఎ, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.



అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారులు

క్యాట్ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

దేశవ్యాప్తంగా కెఎటి ఒలింపియాడ్ సంస్థ నిర్వహించిన పరీక్షలో స్థానిక శ్రీ చైతన్య బొల్లవరం శాఖ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒలింపియాడ్ పరీక్షలో 20 మంది విద్యార్థులకు క్యాష్ అవార్డులు, 120 మంది విద్యార్థులకు మెడల్స్‌తోపాటు మెరిట్ సర్టిఫికేట్లు, 71మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికేట్లు సాధించారని ప్రిన్సిపల్ వినోద్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎజిఎం నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ రీసెర్చ్ ఓరి యంటెడ్ టీచింగ్ మెథడాలజీ, ఐకాన్, సి-బ్యాచ్ వంటి పటిష్టమైన అకాడమిక్ ప్రోగ్రామ్స్‌తోపాటు ప్రణాళికాబద్ధమైన శిక్షణతో అనుభవం కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణనిచ్చామన్నారు. కో-ఆర్డినేటర్ మురళి, ఇన్‌ఛార్జిలు సుధాకర్, నాగేంద్ర, వరలక్ష్మి, ఉపాధ్యాయేతర బృందం విద్యార్థులను అభినందించారు.



విజయచిహ్నం చూపుతున్న విద్యార్థులు

ఉరుసులో అన్నదానం

వల్లూరు : ఖాదర్‌వలీ ఉరుసు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎస్ఐ విష్ణువర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషకరమని నిర్వాహకులను అభినందించారు. పేదలకు సహాయం చేయడం ఎంతో ఆనందం ఉంటుందని తెలి పారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లా డుతూ అనాదిగా వల్లూరులోని మసీదు వద్ద ఖాదర్‌వలీ ఉరుసు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. గురువారం రాత్రి గంధం, మెరువని నిర్వహించామన్నారు కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, ఖదీర్, రసూల్, ఫయాజ్, సలీం ,సద్దాం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొండాపురం : మండలంలోని కొండాపురం 33/11విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి ఓబులేసు తెలిపారు. కొండాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తు పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

వ్య.కా.స జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

కడప అర్బన్ : అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం 10వ జాతీయ మహాసభలు ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు కోల్ కత్తా నగరంలో నిర్వహించనున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. శివ కుమార్, వి.అన్వేష్ తెలిపారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో జాతీయ మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ మహాసభలకు దేశంలోని నలు మూలల నుంచి ఉద్యమ నాయకులు, ఢిల్లీ రైతు ఉద్యమ నాయకులు సామాజిక ఉద్యమ నాయకులతోపాటు వేలాదిమంది ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, నరసయ్య, వీరయ్య, గురువయ్య, జిల్లా కమిటీ సభ్యులు పోలయ్య, రాయప్ప, గోవిందు, విజయ్ కుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.



మసీదులు, ఈద్గాల అభివృద్ధికి కృషి : చైర్మన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా సహకారంతో కృషి చేస్తానని వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జగన్ కాలనీ మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మసీదు కమిటీ పెద్దలు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ సహాయ సహకారాలతో అభివృద్ధికి ప్రాధాన్యతిస్తూ ముందుకు వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో మైనార్టీ పెద్దలు, మసీదు కమిటీ పెద్దలు పాల్గొన్నారు.


వక్ఫ్ బోర్డ్ చైర్మన్ కరీముల్లాను సన్మానిస్తున్న నాయకులు

గడువులోగా ఇ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సుకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

రబీ సీజన్‌లో క్రాప్ బుకింగ్ ప్రక్రియను పకడ్బందీగా త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో ఇ-క్రాప్ బుకింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇ-క్రాప్ బుకింగ్ ద్వారా ప్రొక్యూర్మెంట్, ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు ఏ పంట సాగు చేశారు, ఎన్ని ఎకరాల్లో వేశారు తదితర అన్ని రకాల వివరాలను నమోదు చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా చిరుధాన్యాలను సబ్సిడీ పైన రైతులకు అందించి వాటి సాగును ప్రోత్సహించాలని కోరారు. జిల్లాలో వ్యవసాయ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలన్నారు. రాబోయే రబీ సీజన్‌కి సంబంధించి విత్తనాల సరఫరా, ఎరువులు, పంట బీమా నమోదు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు కావాల్సిన సూచనలు సలహాలను ఎప్పటికప్పుడు అందించి జిల్లాలో వ్యవసాయ అభికృద్ధికి కృషి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా మాట్లాడుతూ ఈ ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినందున రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించి వాటి సాగును ప్రోత్సహించే విధంగా రైతులకు సూచనలు సలహాలు క్షేత్రస్థాయిలో అందివ్వాలని తెలిపారు, ఒక సెంటు భూమి కూడా తప్పిపోకుండా పంట నమోదు ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సభ్యులు తీసుకొచ్చిన సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి రైతుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. జిల్లాలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం, ఇ-క్రాప్ బుకింగ్ ఎన్ని ఎకరాలు చేయాల్సి ఉంది, ఇ-క్రాప్ బుకింగ్‌లో పాటించాల్సిన అంశాలు, రైతు భరోసా కేంద్రాలలో ఎరువుల లభ్యత తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ అధికారులతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. రైతు భరోసా కేంద్రాల్లోని కియాస్కుల ద్వారా అందిస్తున్న సేవలను రైతులకు అందుబాటులోకి తేవాలని ప్రతి రోజు వాటిని వినియోగించాలని, గ్రామ సచివాలయంలోని గోదాములను ఎరువులు నిలువలకు వినియోగించుకునే విధంగా చూడాలని సహాయ వ్యవసాయ సంచాలకులను ఆదేశించారు. డిఆర్‌డిఎ శాఖ ద్వారా ఎస్‌హెచ్‌జి గ్రూపులకు మునగ తోటలను అభివృద్ధి చేసే కార్యక్రమాలను విస్తృతం చేయాలిన్నారు. పట్టు పరిశ్రమ శాఖ ద్వారా పట్టు గూళ్ళు పెంపకానికి 5 నుండి 6 లక్షల రూపాయాల వరకు సబ్సిడీకి అవకాశం కలదని, ఇది మంచి లాభదాయకమైన పంట కావున ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి కమిటీ సభ్యులు బోధషావలి, ప్రసాద్, రవికుమార్‌రెడ్డి, జిల్లా సెరికల్చర్ అధికారి రాజశేఖర్‌రెడ్డి, డ్వామా పీడీ మద్దిలేటి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు గుర్తించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని గ్రామాలు, మండలాల్లో ప్రభుత్వ అసైన్‌మెంట్ భూముల గుర్తింపు వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష ఆర్‌డిఒలు, తహశీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అసైన్‌మెంట్ భూములు, బిఎస్‌ఎన్‌ఎల్‌కు భూమి కేటాయింపు, రీ సర్వే, ఎస్సీ, ఎస్టీ కాలనీలలో శ్మశాన వాటికలకు స్థలాల గుర్తింపు, క్లరికల్ కరెక్షన్స్ ఆఫ్ మాడ్యుల్స్ డిజిటల్ సిగ్నేచర్ స్టేటస్ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయాతో కలిసి తహశీల్దార్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాలలో తహశీల్దారులు వారి వారి విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇప్పటి వరకు అన్ని మండలాలలో అసైన్‌మెంట్ భూములు దాదాపు 500 ఎకరాలు గుర్తించామన్నారు. వారంలోగా 800 ఎకరాల భూమిని గుర్తించడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. భూముల గుర్తింపును ఆర్‌డిఒలు స్వయంగా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ప్రభుత్వ భూమి ఒక్క సెంటు కూడా అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని తహశీల్దార్లకు సూచించారు. వారి పరిధిలోని వాగులు, వంకలు, పోరంబోకు స్థలాలను కాపాడాలన్నారు. తహశీల్దారులందరూ ప్రతి మండలంలో గ్రామాల వారీగా సర్వే నెంబర్ల వారీగా ప్రభుత్వ భూమి గుర్తించి నివేదిక పంపాలన్నారు. ఈ విషయంలో అలసత్వం చూపితే సహించేది లేదన్నారు. బిఎస్‌ఎన్‌ఎల్‌కు స్థలాల కేటాయింపును త్వరితగతిని పూర్తి చేయాలన్నారు. రీ సర్వే అంశంలో భాగంగా 40 గ్రామాలలో అన్ని మాడ్యూల్స్ పూర్తయ్యాయని తెలిపారు. 14 గ్రామాలలో ఒక మాడ్యూల్, 17 గ్రామాలలో రెండు మాడ్యూల్స్ పెండింగ్ ఉన్నాయని, వీటిని వెంటనే పూర్తి చేయాలని సంబంధిత తహశీల్దార్లను, రీ సర్వే అధికారులను ఆదేశించారు. త్వరలో మరో 25 గ్రామాలలో కొత్తగా రీ సర్వే మొదలు కాబోతోందని చెప్పారు. ఇప్పటికే రీసర్వే పూర్తయిన గ్రామాలలో ఎదుర్కొన్న సమస్యలు ఇబ్బందులపై దృష్టి పెట్టి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరింత మెరుగ్గా రీ సర్వే పనిని త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. రీ సర్వేలో సాధారణంగా జాయింట్ ఖాతా, డిస్ప్యూట్స్, ఆక్రమణలు, పొజిషన్ మార్పులలో ఇబ్బందులు, సమస్యలు తలెత్తుతాయని వాటిని ప్రత్యేక దృష్టితో పరిశీలించి రైతులతో సంప్రదించి పరిష్కరించాలని సూచించారు. రీ సర్వే గ్రామాలలో ముందుగానే టామ్ టామ్ ప్రచారం చేయాలని, రీ సర్వే బృందం ఒకటి, రెండు రోజులు ఆ గ్రామంలోనే ఉండాలన్నారు. ఆర్‌డిఒలు, తహశీల్దార్లు వారానికి ఒకరోజు రీ సర్వే జరుగుతున్న గ్రామాన్ని తప్పకుండా సందర్శించాలని సూచించారు. రీ సర్వే పూర్తయిన చోట ఏదేని కారణాలవల్ల ఇంకా భూహక్కు పత్రాలు పంపిణీ చేయని గ్రామాలలో సమస్యలు పరిష్కరించుకొని త్వరితగతిన భూహక్కుపత్రాలు పంపిణీ చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే గ్రామాలలో రైతులందరికీ నోటీసులు జారీ చేసి సర్వే పూర్తయిన తర్వాత తప్పకుండా రైతులతో సంతకాలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని సర్వే సిబ్బంది తహశీల్దార్లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని నిర్దేశించిన కాల పరిమితిలోగా సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. జిల్లాలో శ్మశాన వాటికలు లేని ఎస్సీ, ఎస్టీ కాలనీలకు వెంటనే శ్మశాన వాటికల ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలన్నారు. జిల్లాలోని 288 గ్రామాలలో 181.59 ఎకరాలను గుర్తించడం అంచనా కాగా ఇప్పటి వరకు 146 గ్రామాలలో కనీసం 50 సెంట్ల నుంచి ఒక ఎకరా లోపు స్థలాలను గుర్తించి ఆమోదం కొరకు జిల్లా సచివాలయానికి పంపామని తెలిపారు. మిగిలిన మండలాలలో కూడా త్వరితగతిన స్థలాలను గుర్తింపు పూర్తి చేసి ఆమోదానికి పంపించాలన్నారు. ఆమోదించిన బరియల్ గ్రౌండ్ సర్వే నెంబర్లను ఆన్‌లైన్ చేసి మండలాల వారీగా అడంగల్ కాపీని జిల్లా కేంద్రానికి పంపించాలని పేర్కొన్నారు. అనంతరం క్లరికల్ కరెక్షన్స్ ఆఫ్ మాడ్యుల్స్-డిజిటల్ సిగ్నేచర్ ప్రగతిపై సమీక్షించి పలు సూచనలు జారీ చేశారు. సమీక్ష సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి ఆర్‌డిఒలు రంగస్వామి, మురళి, అన్ని మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

కానిస్టేబుల్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

- మదనపల్లిలో 20, రాజంపేటలో 10 కేంద్రాలు
- పరీక్షకు హాజరుకానున్న 13,684 మంది

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లాలోని ఈ నెల 22వ తేదీ జరుగుతున్న కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 30 పరీక్ష కేంద్రాలలో 13,684 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. అభ్యర్థులు ఉదయం 9 నుండి 10 గంటల వరకు అనుమతిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంది. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్లు, బ్లూటూత్, వాచ్‌లకు అనుమతి లేదు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ను మాత్రమే తీసుకురావాల్సి ఉంటుంది. అభ్యర్థులు అవకతవకలను పాల్పడిన, పరీక్ష కేంద్రాల వద్ద అనుమానితులు కనిపించిన, కాపీ లేదా మాల్ ప్రాక్టీస్కు పాల్పడిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు శుక్రవారం వెల్లడించారు. ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని కానీ పరీక్ష కేంద్రాలలో సహాయం చేస్తామని మాయమాటలు చెప్పి డబ్బులు తీసుకుని ఉంటే వెంటనే డయల్ 100 ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎటువంటి మోసాలకు తావు లేదన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పరీక్ష కేంద్రాల దగ్గర జిరాక్స్ సెంటర్లు ఇంటర్నెట్ సెంటర్లు మూసివేస్తామని పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రాల వద్ద డిఎస్‌పి స్థాయి అధికారి నేతృత్వంలో నిరంతరం తనిఖీలు చేస్తామని తెలిపారు. మొబైల్ పార్టీలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు తిరుగుతూ ఉంటాయని పేర్కొన్నారు. మదనపల్లి, రాజంపేట ప్రధాన కూడళ్లలో అభ్యర్థుల కోసం హెల్ప్ డేస్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కానిస్టేబుల్ పరీక్ష రిక్రూట్‌మెంట్ పోలీస్ బోర్డు ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఫిజికల్, రాత పరీక్షలలో ఉత్తీర్ణలుతైనే ఉద్యోగాలు వస్తాయని అభ్యర్థులు గుర్తించుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న ఉద్యోగ సంఘం నాయకులు

ఉద్యోగుల సంఘంపై విమర్శలు తగవు

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘంపై ఎపిఎన్‌జిఒ సంఘం విమర్శలు చేయడం తగదని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి జి.గురుప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణపై వ్యక్తిగత దూషణలకు దిగడం, తమ సంఘ గుర్తింపు రద్దుచేయాలన్న ఎపిఎన్‌జిఒ సంఘ అధ్యక్షులు బండి బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో పనిచేసే ఉద్యోగులుగా గవర్నర్‌ను కలవడం ఏవిధంగా రూల్‌కు విరుద్ధమో తెలపాలని డిమాండ్ చేశారు. జీతభత్యాల కోసం చట్టం చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నరును అడగడం ప్రజాస్వామ్యయుతమైన హక్కులలో భాగమేతప్ప విరుద్ధం కాదన్నారు. సమావేశంలో కోశాధికారి సుధాకర్‌రాజు, ఉపాధ్యక్షులు రెడ్డినాయక్, రాయచోటి తాలూకా అధ్యక్షులు సాయికుమార్, కార్యదర్శి సుజిత్, ఉపాధ్యక్షులు మోహన్‌బాబు, సంయుక్త కార్యదర్శి హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వి.రవీంద్ర, పెన్షనర్ సంఘం అధ్యక్షులు రాజ, జయరామ చంద్ర, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు ఒరిగిందేమీ లేదు?

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అధికారంలో వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఒరిగింది ఏమీలేదని డిసిసి మైనార్టీ అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. శుక్రవారం తన పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భూకబ్జాలు, ఇసుక, మైనింగ్, గుట్కా, మాదకదరవ్యాలు, మైనార్టీలపైన దాడులు రాష్ట్రంలో పెరిగిపోయావని ఆయన ఘాటుగా విమర్శించారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేయడం వల్ల కేంద్ర, రాష్ట్రాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారని చెప్పారు. మైనార్టీల పైన జరిగే దాడులను ఎలా ఆపాలో, భూ కబ్జాలు, మాదక ద్రవ్యాలను ఎలా అరికట్టాలో, రాహుల్ గాంధీకి బాగా తెలుసు అని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఈ దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. రాష్ట్ర విభజన చట్టంలోని అన్ని అంశాలు అమలు పరుస్తారని ఆయన భరోసా ఇచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రజలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. సమావేశంలో మైనార్టీ యువ నాయకులు మన్సూర్, విక్టోరియాస్, జాకీర్‌బాషా ఆసిఫ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

క్రీడా స్ఫూర్తిని చాటుదాం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

క్రీడలను సంతోషంగా ఆస్వాదించి ఆడాలని, క్రీడా స్ఫూర్తిని చాటాలని టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం టాస్ వేసి క్రీడాకారులతో కలసి కొద్దిసేపు బ్యాటింగ్ చేసి, క్రికెటర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా సానుకూల దృక్పథం ఏర్పడుతుందని, గెలుపోటములు స్వీకరించే గుణం అలవడుతుందని పేర్కొన్నారు. యువత క్రీడల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు రాము యాదవ్, ప్రధాన కార్యదర్శి సుహేల్, యువ నాయకులు ఊటుకూరు సతీష్ రాజు, మృగరాజు, విజయ్ నాయుడు, ముస్లిం మైనారిటీ పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మండెం కరీముల్లా, ఒంటిమిట్ట వినోద్ రెడ్డి, శేషారెడ్డి, సూర్యనారాయణ రాజు, గణపతి, సురేష్, నాగేంద్ర తులసి, కంటా శివ, రాజేష్ వర్మ, శేఖర్, యాసీన్ శివ, రవీంద్ర, అభిరామ్, క్రికెట్ ఆర్గనైజర్లు రాఘవ, శివ, కిరణ్ పాల్గొన్నారు.

ఎపిలో పాగా కోసమే కెసిఆర్ పన్నాగం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మరోసారి ముంచడానికే బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో ఏర్పాటు చేస్తూ కెసిఆర్ వస్తున్నాడని పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తూ బిసి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బోడెం రాజశేఖర్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెసిఆర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపైన మాట్లాడిన మాటలు గాని, రాష్ట్రాన్ని ముంచిన విధానన్ని రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అప్పుడే మరచి పోయాయా అని ప్రశ్నించారు. రాజకీయ పబ్బం కోసమే కెసిఆర్ సమైక్య రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేశాడని విమర్శించారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలు, యువత, రైతులు, కార్మికులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసిహెచ్‌పిఎస్ నాయకులు హరి, వేణు, ఎం.వెంకటేశ్వర యాదవ్, రామలింగయ్య, బండి రామచంద్ర, నాగినేని గోవిందు, మక్కినేని వేణుగోపాల్, ఉదయా రెడ్డి, శంకర్ రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.


అంబేద్కర్ వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూక్ష్మ నీటి పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

జిల్లా వ్యాప్తంగా రైతులకు నూతనంగా అందిస్తున్న డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూక్ష్మ సేద్య జిల్లా అధికారి వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లి, బాల్‌రెడ్డి గారి పల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. రైతులకు అందించిన పరికరాలను క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. రైతులకు డ్రిప్ పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు వ్యవసాయ రంగంలో సూక్ష్మ సేద్యం ప్రాధాన్యత గురించి రైతులకు తెలియజేశారు. ప్రతి రైతూ నీటి ప్రాముఖ్యత తెలుసుకొని పంట సాగు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఐడిసి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్ఐ ఇంజనీర్ గురు ప్రసాద్, విహెచ్ఎ అప్సర్, ఎంఐఒ వెంగయ్య, రైతులు పాల్గొన్నారు.

వాలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని హసనాపురం, చిట్లూరు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్ల పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఒ హైదర్ వలీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిట్లూరు బిసి జనరల్ ఒకటి, హసనాపురం బిసి జనరల్ ఒకటి ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 21వ తేదీ ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 22న దరఖాస్తులను పరిశీలించి, 27న ఎంపిడిఒ కార్యాలయంలో ఇంటర్వ్యూలో నిర్వహిస్తామని పేర్కొన్నారు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 30న నియామక పత్రాలు అందజేసి, 31న శిక్షణ, ఫిబ్రవరి ఒకటిన విధుల్లో చేరాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఆరోగ్యకరమైన చేపలను విక్రయించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పరిశుభ్రమైన పరిసరాలలో ఆరోగ్యకరమైన చేపలను విక్రయించి ప్రజారోగ్యం కాపాడాలని మున్సిపల్ కమిషనర్ రాంబాబు అన్నారు. శుక్రవారం కలెక్టర్ గిరీష ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు మత్స్యశాఖ అధికారులు సంయుక్తంగా పట్టణంలోని చేపల విక్రయ దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపలను పరిశుభ్రమైన పరిసరాలలో ఉంచి ఆరోగ్యకరమైన తాజా చేపలను విక్రయించి ప్రజలకు అందించాలని ప్రభుత్వం అందిస్తున్న బ్యాంకు రుణాలను మత్స్యకారులు సద్వినియోగం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ రెడ్డయ్య, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, మత్స్యశాఖ అసిస్టెంట్ రామ్మోహన్ నాయక్, చేపల విక్రయదారులు పాల్గొన్నారు.

నిర్ణీత ధరలకే యంత్ర పరికరాలు : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను సరసమైన ధరలకు అందించాలని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా వ్యవసాయ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన వ్యవసాయ యంత్ర పరికరాల సరఫరా అంశంలో డిపిఎంసి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో జిల్లాలోని వివిధ రకాల వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేసే డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, పరికరాలు పంపిణీ తయారీదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమీమ్ అన్సారీయా మాట్లాడుతూ ప్రభుత్వం రైతన్నల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోంది. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 15 కంపెనీల తయారీదారులు ముందుకు వచ్చి పంపిణీ చేయడానికి సమ్మతించారని పేర్కొన్నారు. బయట మార్కెట్ రేట్ కన్నా తక్కువ ధరకు ధరలు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. మిగిలిన వారందరూ కూడా ముందుకు రావాలని కోరారు. అనంతరం సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారిని ఉమా మహేశ్వరమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి రవీంద్రబాబు, ఎపి ఆగ్రోస్ జిల్లా మేనేజర్, జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ కడప వారు, యంత్ర పరికరాల తయారీదారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి తమీమ్ అన్సారీయా



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న భానుమూర్తి రాజు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని వ్యాయామ విద్య రాష్ట్ర ఇన్‌ఛార్జి భానుమూర్తిరాజు పేర్కొన్నారు. శుక్రవారం శ్రీ చైతన్య పాఠశాలలో ఎజిఎం రమణయ్య, ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ విద్యార్థులకు పలు క్రీడల పట్ల అవగాహన కల్పిస్తూ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భానుమూర్తి రాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే సర్వతో ముఖాభివృద్ధి చెందుతారన్నారు. క్రీడల వలన ఆరోగ్యంతో పాటు దేహదారుఢ్యం, మానసిక వికాసం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి విద్యా, ఉద్యోగాలలో కోటా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను క్రీడలలో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, డీన్ వెంకటసుబ్బయ్య, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, ప్రైమరీ ఇన్‌ఛార్జి కస్తూరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిజెపి, వైసిపితో రాష్ట్రానికి అన్యాయం : కాంగ్రెస్

ప్రజాశక్తి-రాయచోటి

బిజెపి, వైసిపి ప్రభుత్వాల వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ రాయచోటి నియోజకవర్గం ఇన్‌ఛార్జి అల్లా బకాష్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి బిజెపి ఒక శనిగ్రహమన్నారు. రాష్ట్రానికి వైసిపి, టిడిపి రాహుకేతులని విమర్శించారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా పరిశ్రమలను అమ్మేస్తున్నారని ఇక రాష్ట్రానికి వస్తే ఇసుక, మైనింగ్, గుట్కా, మారకద్రవ్యాలు, భూ కబ్జాలు లాంటి ఎన్నో గోరాలు నేరాలు జరుగుతున్న ప్రభుత్వంకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. మైనార్టీలపైన జరుగుతున్న దాడులను, దళితుల పైన జరుగుతున్న దాడులు అన్నీ కూడా వైసిపి నాయకులే చేస్తున్నారనీ విమర్శించారు. ఈ విధంగా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు సూత్రాలు అమలు చేస్తే దేశాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేక హోదాను అమలు చేస్తుందన్నారు. కేంద్రం నుండి బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు తెప్పించి, రాయలసీమ, ఉత్తరాంధ్రను అభివృద్ధి పరుస్తుందిన్నారు. విభజన చట్టంలో పేర్కొనబడి గత ఎనిమిదిన్నర సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం ఓడరేవు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ మెట్రో, విజయవాడ మెట్రో, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ తదితర అన్ని సమస్యలను నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరిస్తామన్నారు. రైతులకు రూ.3 లక్షలు వరకు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తుందిన్నారు. రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ సరఫరా, నిరుపేద కుటుంబాలకు నెలకు రూ.6 వేలు ఆర్థిక సహాయం ఇవన్నీ అమలు చేస్తే రైతులకు ఉద్యోగులకు పార్టీ కార్యకర్తలకు నాయకులకు అన్ని విధాల మేలు జరుగుతుందని పేర్కొన్నారు కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్నకృష్ణ, తాలూకా మహిళా ప్రెసిడెంట్ రవణమ్మ, రాయచోటి మండల ప్రెసిడెంట్ నాగయ్య, రాయచోటి మండల మహిళా ప్రెసిడెంట్ నాగలత పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అల్లాబకాష్


నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

నాడు-నేడు పనులు పరిశీలన

ప్రజాశక్తి-కలకడ

మండలంలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పరిశీలించారు. మండలంలోని నడిమిచర్ల, కదిరాయచెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలలో జరుగుతున్న నాడు- నేడు పనులను పరిశీలించి, నాణ్యతతో కలిగిన పనులు చేసి నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. నడిమిచర్ల ఉన్నత పాఠశాలలో వంటగది నిర్మాణాలను పరిశీలించి రెండు పాఠశాలల నందు మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేసి మెనూ ప్రకారం పిల్లలకు భోజనాలు వడ్డించాలని సూచించారు. కదిరాయచెరువులో అదనంగా నాలుగు గదులు మంజూరు కావడంతో నాడు-నేడు పనుల ద్వారా చేయడంపై పనులను నాణ్యతగా ప్రమా ణాలను పాటించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఆశయ సాధనకు శ్రీకారం చుట్టారని దానిని అందరూ అమలుపరిచి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ మునింద్రనాయక్, నడిమిచెర్ల, కదిరాయచెరువు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, రెడ్డిమోహన్, వైసిపినాయకులు నరసింహారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23న భాషా పండితుల పరీక్షలు

రాయచోటి : ఈనెల 23 నుంచి 28వ తేది వరకు భాషా పండితులు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వై.రాఘవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. విద్యార్థుల హాల్ టికెట్లను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. బిఎస్ఇ.ఎపి.జిఒవి.ఐఎన్ వెబ్సైట్ నందు పొందుపరచి నట్లు పేర్కొన్నారు.


క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి

సీమ స్థాయి విజేతకు రూ.2 లక్షల బహుమతి

ప్రజాశక్తి- ఓబులవారిపల్లి

మండల పరిధిలోని చెల్లంపాలెం గ్రామంలో 24 క్రికెట్ టిమ్‌లతో జరగనున్న రాయలసీమ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ని రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్‌రెడ్డి ప్రారంభించారు. ముక్కా రూపా నందరెడ్డి ఫౌండేషన్ ద్వార విజేతలకు మోదటి బహుమతిగా రూ.1.50, లక్షలు, రెండవ బహుమతిగా రూ.50 వేలను ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా క్రీడాకారులని ఉద్దేశించి మాట్లాడుతూ గెలుపోటములు సర్వసాధారణమని, ఇక్కడ ఆడిన క్రీడాకారులు ఉన్నతస్థానాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బత్తిన వేణుగోపాల్ రెడ్డి, డిఆర్‌యుసిసి తల్లెం భారత్ కుమార్ రెడ్డి, తల్లెం విష్ణు వర్ధన్ రెడ్డి, తల్లెం చంద్ర మోహన్ రెడ్డి, గజ్జల శ్రీనివాసులు రెడ్డి, శ్రీనాథం జగదీశ్వర్ రెడ్డి, ఎర్రబాపు వేణుగోపాల్ రెడ్డి, ఏర్ర బాపు మధుసూదన్ రెడ్డి, ముక్కా రజినీ కాంత్ రెడ్డి, ముక్కా ప్రదీప్ కుమార్ రెడ్డి, సుదకర్ రెడ్డి, సాలవ వెంకటరమణ రాజు, గద్దె పెంచలయ్య, ముక్కా వారి పల్లి సర్పంచ్ అరవశ్రీధర, ఎంపిటిసి విజయ్‌కుమాం గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులకే ప్రభుత్వ పథకాలు అందాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో అర్హులైన వారికందరికీ ప్రభుత్వ పథకాలు అందించే విధంగా సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కృషి చేయాలని ఎంపిడిఒ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పరసతోపు గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉండి కార్యాలయానికి వచ్చిన వారి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం చేసిన ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఆయన వెంట వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సోమశేఖర్, విఆర్ఒ రమణ ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి- ఓబులవారిపల్లి


మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కొల్లం గంగిరెడ్డి

మండల పరిధిలోని పెద్ద వరం పాడు గ్రామంలో రెండు రోజుల క్రితం కారు ప్రమాదంలో ప్రా ణాలు కోల్పోయిన ఎం.సిద్దేశ్వరరెడ్డి, కె.తేజేశ్వర్ రెడ్డి కుటుంబాలను, ఇటీవల మరణించిన పి. వెంకటనారాయణ రెడ్డి కుటుం బాన్ని శుక్రవారం కొల్లం గంగిరెడ్డి వారి గృహాలకు వెళ్ళి పరామర్శించారు. వారికి కుటుంబాలకు అన్ని విధాలుగా అందు బాటులో ఉంటానని ఎటు వంటి సహాయ సహకారాలు కావాలన్నా తనను సంప్రదించాలని తెలియ జేశారు. కార్యక్రమంలో అనంతంపల్లి మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, పి.రామచంద్రారెడ్డి, రాఘవరెడ్డి, చంద్రయ్య, వి.సుధా కర్‌రెడ్డి, ఎం.సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి మన్నెం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలపరిధిలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ప్రకాశం ఒక ప్రకటనలో తెలియజేశారు. శనివారం టి.కమ్మపల్లి జడ్పి హైస్కూల్‌లో 23, 24వ తేదీలలో ఎపి మోడల్ స్కూల్ నందు ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ క్యాంపు నందు ఆధార్ సేవలను విద్యార్థులు, ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

రైతుల నుంచి పాలు కొనుగోలు

ప్రజాశక్తి-గాలివీడు

అమూల్ పాలు డెయిరీ ద్వారా రైతులకు ప్రయోజనం సమకూరుతోందని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని నూలివీడు గ్రామ సర్పంచ్ ఉమాప రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలోని కొత్తపల్లి, నాగూరు వాళ్లపల్లి గ్రామాలలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీ ఇంటికి నేరుగా అమూల్ డెయిరీ ద్వారా పాలు కొనుగోలు చేయడానికి వస్తారని, రూ.2.90 అదనంగా పొందే అవ కాశం ఉందని తెలిపారు. ఈ అవకాశం రైతులందరూ వినియోగిం చుకోవాలని తెలిపారు. గ్రామంలో 300 పైన గేదెలు, పశువులు ఉన్నాయని దాదాపు 900 లీటర్ల పాలు ప్రతిరోజు డెలివరీ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎంఎన్.రజినీస్‌రెడ్డి, వాలంటీర్లు, రైతులు మహిళలు పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** రాష్ట్ర ప్రభు త్వం పాడి రైతులు కోసం గిట్టుబాటు ధర కల్పించడం కోసం జగనన్న పాల విలువ కార్యక్రమం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా బండ్రేవు పంచా యతీలో సచివాలయంలో సర్పంచ్ భారతీయ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారి డాక్టర్ ఉస్మాన్ మాట్లాడుతూ పాడి రైతులకు గిట్టు బాటు ధర కల్పించడం కోసం అములూ్య డెయిరీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ మిత్రాలు రెడ్డెప్ప, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత ప్రచారం : ఎస్‌పి

ప్రజాశక్తి-సుండుపల్లి



రోడ్డు సేఫ్టీ పోస్టర్ల ఆవిష్కరణలో ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్‌జిఒలు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతావారోత్సవాలు సందర్భంగా ఎన్‌జిఒ ఆధ్వర్యంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు, విద్యార్థులకు రోడ్డు భద్రత పై అవగాహన కోసమే తయారు చేసిన ప్రచార సామాగ్రిని ఆయన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వాహనదారులే కాకుండా ఎన్‌జిఒలు కూడా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రచారం చేయాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మద్యం సేవించి వాహనాలు నడపటం మూలం గానే జరుతున్నాయని తెలిపారు. రోడ్డు సేఫ్టీ ఎన్‌జిఒ జిల్లా ప్రాంతీయ అధ్యక్షులు నంద్యాల రెడ్డి రాణి మాట్లాడుతూ ఎన్‌జిఒ స్వచ్ఛందముగా రోడ్డుభద్రతా వారోత్సవాల ప్రచార సామగ్రిద్వారానే ఈ సంవత్సరం స్వచ్చత పక్వడా అనే నినాదాలతో రోడ్డు భద్రతా వారోత్సవాలు జరుపుకుంటున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఒక సంవత్సరానికి ఒక లక్ష యాభై వేల మంది మరణిస్తున్నారని అన్నారు. **చిన్నమండ్యం :** మండలకేంద్రంలో రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆరోగ్యశాఖ అధికారుల సహాయంతో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆటో డ్రైవర్లు వైద్యశిబిరంలో పాల్గొని వైద్యచికిత్స పొందారు. వైద్యసిబ్బంది ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగానే ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తూ ప్రయాణికులు, సమాజం, వృద్ధుల పట్ల, బాధ్యతతో మెలగాలని సూచించారు. డ్రైవర్లు కుటుంబాలను గుర్తుపెట్టుకుని వాహనలను రహదారులపై నడపాలని పేర్కొన్నారు. అతివేగంతో వాహనాలు నడిపినట్లయితే ప్రయా ణికులను ఇబ్బంది పెట్టడమే కాకుండా డ్రైవర్ల కుటుంబాలు సైతం రోడ్డున పడే అవకాశాలు లేకపోలేదన్నారు. కాబట్టి ప్రతి ఒక్క డ్రైవర్ రహదారి నియమ నిబంధనలను పాటించి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారు. **రాజంపేట అర్బన్ :** మద్యం సేవించి వాహనాలను నడిపితే రోడ్డు ప్రమాదాలకు గురవుతారని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. బోయినపల్లి జాతీయ రహదారిపై 34వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు : 'గడికోట'


గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-గాలివీడు

వైసిపి పాలనలో ఇంటివద్దకే వైద్యసేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గరుగుపల్లి పంచాయతీలో గరుగుపల్లి కస్పా, టమాటావారిపల్లి, గొల్లపల్లి, కొత్తపల్లిలో గడపగడప కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ పథకాలు అందిస్తామన్నారు. అనారోగ్యం బారిన పడిన వృద్ధులను పరామర్శించారు. కస్పాలో ఏర్పాటుచేసిన గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణ రెడ్డి, వైసిపి మైనార్టీ నాయకుడు ఎస్‌కె.ఖాదర్మొద్దీన్, లకిడిపల్లి విశాఖ మాస్ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జానకమ్మ , రామానుజన్ రెడ్డి, శంకర్ నాయుడు, సర్పంచులు ఉమాపతి రెడ్డి, గుండ్ల చెరువు సర్పంచ్ ఎంపిడిఒ శేఖర్ నాయక్ ,గ్రామ సర్పంచులు, ఎంపిటిసి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మసీదుల అభివృద్ధికి నిధులు మంజూరు : 'చింతల'

ప్రజాశక్తి-కలికిరి


నిధుల మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పట్టణంలోని మసీదులకు ఎంపీ సొంత నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు రూ.18లక్షలు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అందజేశారు. ఈనెల 10న పట్టణంలోని వివిధ మసీదుల అభివృద్ధి కోసం రూ.48 లక్షల రూపాయలను మంజూరు చేసిన విషయం విధితమే. ఈ సందర్భంలో ముస్లిం మైనార్టీ సోదరులు వివిధ రకాల అభివృద్ధి కోసం, భూమి కొనుగోలు కోసం అదనంగా నిధుల కోరగా కేవలం పది రోజుల్లోనే మైనార్టీ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేశారని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అగా మొహిద్దీన్, రాష్ట్ర మార్కెట్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, పీలేరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు సహదేవ రెడ్డి, ఎంపిడిఒ గంగయ్య, వేంపల్లి ఖాదర్ వలీ, నాయకులు సతీష్ ఒడ్డి, జిల్లా ఎస్‌సి సెల్ కార్యదర్శి వి.హరి, మసీదులకమిటీపెద్దలు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.


డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సంఘం సభ్యులు

బిసి 'బి' కులధ్రువీకరణ ఇవ్వాలి

ప్రజాశక్తి-ములకలచెరువు

మొరుసు కాపులకు జిఒ 33 ప్రకారం బిసి-బి కులధ్రువీకరణ ఇవ్వాలని స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌కు మొరుసుకాపు(ఒక్కలిగర) సంఘం తరుపున శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మొరుసుకాపు సంఘం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన 33జిఒ ప్రకారం ములకలచెరువు మండలంలో ఉండే మొరుసుకాపు కుటుంబాలకు బిసి-బి కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. జిఒ అమలులోకి వచ్చి నాలుగు సంవత్సరాల అవుతున్నా కూడా ఇంతవరకు కులదృవీకరణ పత్రాన్ని ఇవ్వక పోవడంతో విద్యా పరంగా, ప్రభుత్వ పథకాలు పరంగా ఎన్నో అవకాశాలను కోల్పోతున్నామని డిటికి తెలియచేశారు. ఈ సందర్భంగా డిటి స్పందిస్తూ జిఒ 33 ప్రకారం మీకు అర్హత ఉంది కాబట్టి మండలంలో మొరుసుకాపులు మీ సంఘం తరుపున సంఘం సర్టిఫికెట్ తో దరఖాస్తు చేసుకుంటే బిసి-బి కులదృవీకరణ పత్రాన్ని ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మొరుసుకాపు రెడ్డి నాయకులు మార్కిరి ఆంజనేయ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ గౌనివారి వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి నరసింహ రెడ్డి, శంకర్ రెడ్డి, ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, హనుమంత్ రెడ్డి, తరుగు శివా రెడ్డి, రమేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.


సౌర విద్యుత్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్.రామచందర్

సౌర విద్యుత్‌పై అవగాహన

ప్రజాశక్తి- రాజంపేట

ఉచితంగా లభ్యమయ్యే సౌర విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రెట్రాన్ ఎనర్జిస్ టెక్నికల్ డైరెక్టర్ ఎన్.రామచందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఒకరోజు వర్క్ షాపు నిర్వహించారు. ఛాలంజెస్ అండ్ ఆఫర్చునుటీస్ ఇన్ సోలార్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్ అనే అంశంపై ఇఇఇ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్ షాపుకు ఎన్.రామచంధర్, టెక్నికల్ డైరెక్టర్ రెట్రాన్ ఎనర్జీస్ రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. అధునాతన సౌర, ఎలక్ట్రిక్ వాహనాల టెక్నాలజీ గురించి, ఇందులోని సవాళ్ళ గురించి, ప్రభుత్వం అందించే రాయితీలు గురించి ఈ రంగంలో వ్యాపార లావాదేవీలు గురించి నాల్గో సంవత్సరం విద్యార్థులు శిక్షణ పొందారు. కార్యక్రమానికి ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ ఎం.పద్మలలిత కన్వీనర్‌గా వ్యవహరించారు. డాక్టర్ ఎస్ సురేష్, ఎన్ శ్రీరాముల రెడ్డిలు కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

నేటి నుంచి వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

తంబళ్లపల్లి : మండలంలోని కోసవారిపల్లెలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం నుండి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు టిటిడి డిప్యూటీ ఇఒ వరలక్ష్మి , ఇన్స్పెక్టర్ రెడ్డి భాస్కర్‌లు గురువారం విలేకరులకు తెలిపారు. టిటిడి ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి బ్రహ్మోత్సవాలకు ముస్తాబు చేశారు. శనివారం అంకురార్పణ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 22న గజారోహణం, పల్లకి ఉత్సవం, 23న శేష, హంస వాహనాలపై స్వామివారి ఊరేగింపు, 24 ముత్యపు పందిరి వాహనం, సింహ వాహనం, 25న కల్పవృక్ష వాహనం, హనుమంత వాహనం, 26న సూర్యప్రభ ,చంద్రప్రభ వాహనాలపై ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 27న సర్వభూపాల వాహనం, రాత్రి స్వామివారి కల్యాణోత్సవం, గరుడవాహనం సేవలు జరుగుతాయన్నారు. 28 న రథోత్సవం, గజ వాహనం, 29న పల్లకి ఉత్సవం, అశ్వ వాహనం, 30న వసంతోత్సవం, చక్రస్నానం, ధ్వజారోహణం, 31న సపన తిరుమంజనం,రాత్రికి పుష్పయాగం కార్యక్రమంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాలు జరిగే ప్రతిరోజు ధర్మ ప్రచార పరిషత్ వారిచే హరికథలు, సంగీతం, భజన కార్యక్రమాలు నిర్వహించబతాయని తెలిపారు.

స్థాయికి మించి విమర్శలు తగవు

ప్రజాశక్తి-కలికిరి

కొంతమంది వైసిపి నాయకులు తమ స్థాయిని మరచి టిడిపి ఇన్‌ఛార్జ్ నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిపై విమర్శలు చేయడం తగదని టిడిపి ముస్లిం మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనీఫ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వైసిపిలో స్థాయి లేని వ్యక్తులు కిషోర్‌కుమార్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. అనవసర మాటలు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, నియోజకవర్గ నాయకులు సనావుల్లా, సయ్యద్ భాష, రియాజ్, మునావర్, కువైట్ సయ్యద్, గుట్టకింద సైదు, చాను, సాధిక్, లేపాక్షి మహమ్మద్, అఫ్రోజ్, యల్లమంద జిలాని, కరీముల్లా, జావీద్, సుభహన్, జాకీర్, షైదీన్, మహమ్మద్, ఆఫ్రిద్,నవీద్, అస్లామ్ పాల్గొన్నారు.

ఖైదీల్లో పరివర్తన కోసం జైళ్లు తోడ్పడుతున్నాయి

జైళ్ల శాఖ డిఐజి ఎస్.రాహుల్

ప్రజాశక్తి-పీలేరు

జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో మార్పు తీసుకు రావడానికి ఎంతో కృషి జరుగుతోందని రాయలసీమ జోన్ జైళ్ళ శాఖ డిఐజి ఎస్. రాహుల్ తెలిపారు. శుక్రవారం ఆయన పీలేరు సబ్ జైలును ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి మీడియాతో మాట్లాడుతూ క్షణికావేశంలోనో లేక అనుకోని పరిస్థితుల్లోనో తప్పు చేసి శిక్ష అనుభవిస్తున్న వారు పరివర్తన చెందడానికి చాలా అవకాశాలున్నాయని అన్నారు. జైలు నుంచి వారు బయటకు వచ్చాక కూడా ఉపాధి పొందడానికి వీలుగా వారికి తగిన వృత్తి నైపుణ్య శిక్షణలు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. శిక్ష అనుభవిస్తూ విద్యపై ఆసక్తి ఉన్న వారికి ఉన్నత చదువులు చదువుకోడానికి కూడా అవాశాలు ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాయలసీమ జోన్‌లోని చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూల్ జిల్లాల్లో మొత్తం 33 జైళ్ళు ఉన్నాయని అన్నారు. వాటిలో సబ్‌జైళ్ళు 23, ప్రత్యేక ఉపకారాగారాలు 4, జిల్లా జైళ్ళు 3, కేంద్ర కారాగారం ఒకటి, మహిళా జైలు ఒకటి, ఓపెన్ ఏయిర్ జైలు ఒకటి ఉన్నాయని అన్నారు. చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం 363 మంది ఖైదీలు వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు జిల్లా జైళ్ళ అధికారి ఎం. వేణుగోపాల్ రెడ్డి, పీలేరు జైలు సూపరింటెండెంట్ రవిశంకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి రాహుల్


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి కె.లత

జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి-నందలూరు

జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, జూనియర్ సివిల్ జడ్జి కె.లత అన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలపై న్యాయ విజ్ఞాన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఫిబ్రవరి 11న జరిగే జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కక్షిదారులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీర్ఘకాలికంగా పరిష్కృతంగా ఉన్నటువంటి కేసులను సత్వరం పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని తెలిపారు. సివిల్, క్రిమినల్ కేసుల్లో ఉభయ పక్షాలు రాజీమార్గం పరిష్కరించుకునేందుకు వీలుందని తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించడం వల్ల కక్షిదారులు ఏళ్ల తరబడి న్యాయస్థానాలు చుట్టూ తిరిగే అవసరం ఉండదన్నారు. జాతీయలోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే ఇద్దరూ గెలుస్తారని, ఎవరికి ఓటమి ఉండదని అన్నారు. దీని వల్ల కాలం, డబ్బు వృథా కాకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దాసరి నరసింహులు, ఎస్.మహమ్మద్ అలీ, హెచ్.ఆనంద్ కుమార్, షమీవుల్లా ఖాన్, జి. సుబ్బరామయ్య, పి.ఎన్ శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది, కోర్టు పోలీసులు, పిఎల్‌విలు, కక్షిదారులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు

ప్రజాశక్తి - పెద్దమండ్యం

మండలంలోని పాపేపల్లి పంచాయితీలోని పి.తురకపల్లికి పడమటి భాగములో వెలసిన ఎర్రగొండ బాబా ఫక్రుద్దీన్ సాహెబ్ గంధం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాను విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. గంధంను బానసంచా వేడుకలతో, ఫకీర్ల బృందం విన్యాసాలతో ఉత్సాహంగా ఊరేగింపు చేశారు. మతసామరస్యానికి ప్రతీకగా హిందువులు, ముస్లిం సోదరలు కలసి గంధం ఉత్సవంలో పాల్గొన్నారు. శుక్రవారం పాట కచేరి నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి ప్రజలు గందోత్సవంలో పాల్గొని ఆసక్తికరంగా తిలకించారు. కార్యక్రమంలో హిందు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- కలకడ


మృతి చెందిన చరణ్

తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురై విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దిగుతాండ పంచాయతీ ఎగువతండాకు చెందిన బుక్కే ప్రసాద్‌నాయక్ కుమారుడు బుక్కే చరణ్ పీలేరులోని భారతి కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడని తెలిపారు. కళాశాలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో సెలవుల నిమిత్తం స్వగ్రామానికి వచ్చాడని అన్నారు. ఈనెల 16వ తేదీన చరణ్ తన తండ్రి ప్రసాద్ నాయక్ జేబులో నుంచి రూ.500 రూపాయలు తీసుకెళ్లి సిగరెట్లు, మద్యం సేవించి ఇంటికి వచ్చాడని, తండ్రి ప్రసాద్‌నాయక్ చెడు వ్యసనాలకు బానిస కావడం సరికాదని మందలించినట్లు తెలిపారు. తండ్రి మందలించడంతో అదే రోజు సాయంత్రం చరణ్ మనస్తాపంతో ఎడమ చేతి మణికట్టు వద్ద కత్తితో రక్త గాయం చేసుకున్నాడని తెలిపారు. ఈ విషయం గమనించిన తల్లిదండ్రులు గుర్రంకొండ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి వైద్యం చేయించి, ఇంటికి తీసుకెళ్లారని అన్నారు. ఈనెల 18వ తేదీన తన తండ్రి ప్రసాద్ నాయక్, చెల్లెలు ప్రక్కగల వారి బంధువుల ఇంట్లో నిద్రించారు. ఈ క్రమంలో ఇంటిలో ఎవరూ లేని విషయాన్ని గుర్తించి ఇంటిలో ఉన్న చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మరుసటి రోజు ఉదయం తండ్రి ప్రసాద్ నాయక్, చెల్లెలు వచ్చి ఇంటి తలుపులు తెరవడానికి ప్రయత్నించగా తలుపులు రాకపోవడంతో ఇంటి తలుపులు గడ్డపారులతో పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా చరణ్ విగతజీవిగా చీరకు వేలాడుతూ కనిపించాడని తెలిపారు. కుమారుడు బాగుపడాలని తాను మంద లించానని, ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడతాడని అనుకోలేదని బోరున విలపించాడు. చరణ్ తండ్రి ప్రసాద్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రెడ్డిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు


తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు టి.చెన్నమ్మ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మినీ టిప్పర్ వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలైన సంఘటన నిమ్మనపల్లిలో చోటుచేసు కుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు నిమ్మనపల్లి పంచాయతీ పెద్ద హరిజనవాడకు చెంది న టి.చెన్నమ్మ (75) శుక్రవారం మధ్యాహ్నం స్థానిక బస్టాండులో పని నిమిత్తం రోడ్డు ప్రక్కన నిలబడి ఉండగా మదనపల్లి కు చెందిన మినీ టిప్పర్ వాహనం కందూరు వైపు వెళుతూ వృద్ధురాలని ఢీకొని ఈడ్చుకుని వెళ్లిపోవడంతో వృద్ధురాలి ఎడమ చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. హుటాహుటిన స్థానికులు వృద్ధురాలుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం 108 వాహనం ద్వారా మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు మినీ టిప్పర్ వాహనాన్ని అదుపులోకి తీసుకొని సంఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా నిమ్మనపల్లి బస్టాండ్‌లో విచ్చలవిడిగా ద్విచక్ర వాహనాలను, ఆటోలను నిలుపుతూ ఉండడం వలన నిత్యం ట్రాఫిక్‌కు సమస్యతో బస్టాండ్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. స్థానిక పోలీసులు స్పందించి ట్రాఫిక్ ను నియంత్రించాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నిలిపే వారిపై కేసుల నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింకకు గాయాలు

ప్రజాశక్తి-ములకలచెరువు

గుర్తుతెలియని వాహనం ఢీ కొని జింకకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. అటవీశాఖ అధికారుల కథనం మేరకు మండలంలోని వేపూరికోట పంచాయతీ, ఆర్‌ఎస్ బత్తులాపురం సమీపంలో పొలాల్లోకి మేత కోసం వచ్చిన ఓ జింక రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో జింక తీవ్రంగా గాయపడడంతో స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారని తెలిపారు. అటవీశాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన జింకను స్థానిక పశువైద్యశాలలో చికిత్స చేయించారు. గాయపడిన జింక ఆటవీశాఖ అధికారుల సంరక్షణలో ఉంది. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు ఎపీఎస్ మోహన్, ఎస్ఒలు సుధాకర్ గోపాల్ పాల్గొన్నారు.